


భక్తులకు గురుదేవుల షష్టి పూర్తి శుభాకాంక్షలు

శ్రీ ప్రణవపీఠం

सत्यं वद - धर्मं चर

ఏలూరు



# జనవరి, 2026



జనవరి , 2026

## విషయ సూచిక

సంపుటి-5
సంచిక-1


01 సంపాదకీయం — బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

02 శ్రీ గణేశ పురాణం — శ్రీమతి పాలగుమ్మి శ్రీవిద్య

03 శ్రీ వేంకటేశ్వర రహస్యం — శ్రీమతి నిడుముక్కల శ్రీకరి

04 శ్రీ మత్స్యమహాపురాణం — మద్దూరి వేంకట సుబ్రహ్మణ్య సత్యనారాయణ

05 ఐశ్వర్యయోగం — బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్

06 ఋషిచరిత్ర — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

07 కాశీ కథలు — శ్రీ ప్రణవపీఠం శిష్యబృందం

08 స్తోత్రమాలిక — బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్




శ్రీ మహాగణాధిపతయే నమః — శ్రీ గురుభ్యోనమః — శ్రీ మాత్రే నమః

పూజ్య గురుదేవులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనముల కొఱకు, శ్రీ ప్రణవపీఠం సమాచారము కొఱకు క్రింద ఇవ్వబడిన వెబ్సైటు ను సందర్శించగలరు.


https://srivaddipartipadmakar.org

© All copyrights are reserved with Sri Pranava Peetam, Eluru.

శ్రీ గురుభ్యోనమః

# సంపాదకీయం

## గురుపదాలను ఆశ్రయించాలి



"మా కురు ధనజనయౌవనగర్వం, హరతినిమేషాత్ కాలః సర్వమ్", అని ఆదిశంకరులు అన్నారు. ధనం, జనం, యౌవనం ఉన్నాయని గర్వం పొందకు. ఒక్క నిమిషంలో కాలం సర్వం హరిస్తుంది. ధనం ఎంతకాలం ఉంటుందో, ఉన్నా ఏ ప్రమాదం తెస్తుందో ఎవరికీ తెలియదు. కళ్ళముందు సంపన్నులు, బికారులైపోవడం చూస్తూనే ఉంటాం. జనం మన వెంట ఉన్నారనేది కూడా భ్రమ. జనులు ఎప్పుడు పొగడుతారో, లేక తెగడుతారో తెలియదు. కష్టంలో జనులు ఎవ్వరూ వెంటరారు. ఎవరిని వారే రక్షించుకోవాలి. ఇక యౌవనం సంగతి. అది కూడా అస్థిరమే. ఎంతోమంది చూస్తుండగా వృద్ధులయిపోతున్నారు. ఈ సంగతి గ్రహించి ఎప్పుడూ అహంకారం పొందరాదు. గోవిందుని సేవిస్తే ఈ దురవస్థ నుండి రక్షిస్తాడు.కలియుగంలో గోవిందుడు, మంత్రోపదేశాలు, పురాణ ప్రబోధాలు చేసే సద్గురు రూపంలో దర్శనిమిస్తాడు. అందువల్ల "గురుచరణాంబుజనిర్భరభక్తః సంసారాదచిరాద్భవముక్తః" అని శంకరులు సందేశమిచ్చారు. కనుక గురుపదాలను ఆశ్రయించాలి. గురుబోధలు వినడమే కాక ఆచరించాలి. ప్రణవపద్మాకరంలో అనేక దివ్య వ్యాసాలు, పురాణసారాంశాలు ఉన్నాయి. వాటిని చదివి, విని, చదివించి, వినిపించి ఇహపరసుఖాలు పొందండి. మకరసంక్రమణం వస్తున్నది. ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకొని శివసహస్రనామస్తోత్రం, విష్ణుసహస్రనామస్తోత్రం వినండి. నేను స్వయంగా గానం చేసిన శివసహస్రనామ స్తోత్రం, వాసుదేవ స్తోత్రం యూట్యూబ్ లో ఉన్నవి. వాటిని వింటూ పారాయణం చేసి తరించండి. జనవరిలో గురుదర్శనం ఒకటవ తేదీనాడు ఎలాగో చేసుకొంటున్నారు కనుక, గురుభక్తితో వ్యూహలక్ష్మి మంత్రజపం చేయండి. ఆ జపం సర్వసంపదలను ప్రసాదిస్తుంది. శ్రీలంకలో మీ అందరికోసం, అంబాయాగం చేస్తున్నాము. అశోకవనంలో శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్నాము. మీ గోత్రనామాలను వద్దిపర్తి సత్సంగానికి పంపి ఆ పుణ్యయజ్ఞంలో భాగస్వాములు కండి. మాఘమాసం, పుష్యమాసం దేవతల మాసాలు. ఈ కాలంలో గురుస్మరణ, గురుదర్శనం చేసుకొని వీలున్నంతవరకు పరోపకారం చేసి, కాలప్రభావాన్ని మీకు అనుకూలంగా మార్చుకోవాలని మంగళాశాసనం చేస్తున్నాము. ఓం ఐం హ్రీం శ్రీం కాలాయ, కాలకంఠాయ నమః అనే మంత్రాన్ని పుష్య, మాఘ మాసాలలో జపించండి, తరించండి.

వద్దిపర్తి పద్మాకర్

# శ్రీ గణేశ పురాణం



దుర్గా! గణపతి యొక్క ఈ నామాష్టకం అనేక శక్తులతో కూడినది. ఉత్తమమైనది. అష్టకస్తోత్రం అనేక శుభార్థాలతో కూడి, శుభాలను ఇస్తుంది. ఈ స్తోత్రాన్ని మూడు సంధ్యలలో నిత్యం చదివిన వాడు సుఖాలను పొందుతాడు. జయం పొందుతాడు. చదివిన వానికి ఏ పనులలోనైనా విఘ్నాలు ఉండవు. గరుత్మంతుని చూచి పాములు పారిపోయినట్లుగా భక్తుని విఘ్నాలు పారిపోతాయి. ఈ స్తోత్రం చదివిన వానికి గణేశుని అనుగ్రహం వలన గొప్ప జ్ఞానం లభిస్తుంది. సందేహం లేదు. పుత్రులు కోరుకొన్నవానికి పుత్రులు లభిస్తారు. వివాహం కోసం ఈ స్తోత్రం చదివిన వానికి తప్పక మంచి భార్య లభిస్తుంది. చుఱుకుదనం లేనివాడు (మందుడు) కవీంద్రుడు అవుతాడు. విద్యావంతుడు అవుతాడు. ఇది ధ్రువం. పరశురాముని నీ పుత్రుని వలె చూడు. నీకు ఇతడు కూడా కొడుకు వంటి వాడే కనుక ఇతనిపై కోపించకు. శ్రీమహావిష్ణువు ఇలా పార్వతితో పలికి అనంతరం పరశురామునితో ఇలా అన్నాడు — నాయనా! భార్గవా! నీకు హితోపదేశం చేస్తున్నాను. విను. నీవు కూడా నా దివ్యమైన అంశతో పుట్టిన వాడవే. కనుక తొందరపడి అపచారాలు ఇక ముందు ఎన్నడూ చేయకు. ఈ గణేశుడు పరబ్రహ్మస్వరూపుడు. ఆయన దంతం విరగగొట్టి కేవలం ఆయనకే కాక, శివపార్వతులకు కూడా మహాపరాధం చేసావు. ఈ పని అశుభప్రదమైన పని. దీనికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. అపరాధం చేసిన వాడెవడైనా దానికి తగిన ప్రాయశ్చిత్తం చేసుకోకపోతే, నరకాల పాలు అవుతాడు.

అందునా విద్వాంసులు, శివభక్తులు అపరాధం చేయరు. చేయరాదు. పొరపాటు జరిగిన వెంటనే అపరాధం అంగీకరించి ప్రాయశ్చిత్తకర్మ ఆచరించాలి. నేను నీకు గణపతిస్తోత్రాన్ని, ఆపై దుర్గాస్తోత్రాన్ని ఉపదేశిస్తాను. ఆ స్తోత్రాలు కాణ్వశాఖలో చెప్పబడ్డాయి. వాటితో గణపతిని జగన్మాత అయిన దుర్గాదేవిని భక్తితో ప్రార్థించు. జగత్ప్రభువైన శ్రీకృష్ణుని యొక్క బుద్ధి రూప అయిన పరాశక్తి ఈ పార్వతీమాత. ఆమె సంతోషిస్తే సకల భువనాలు ప్రశాంతంగా ఉంటాయి. ఆమె అనుగ్రహం కోసం త్రిమూర్తులు కూడా ప్రయత్నిస్తారు. ఆమె కోపగిస్తే భువన బ్రహ్మాండాలు భస్మమై పోతాయి. నీ బుద్ధి కూడా నశిస్తుంది. శివానుగ్రహానికి దూరం అవుతావు. కనుక భక్తితో ఆ తల్లిని, గణపతిని నేనిచ్చే స్తోత్రాలతో ప్రార్థించి ప్రసన్నులనుచేసుకో. ఇక నీకు తిరుగుండదు. ఆ తల్లి దివ్యశక్తి అనంతం. ఎవ్వరికీ అంతుపట్టదు. ఆదిపరాశక్తి ఈ దుర్గయే.


.. ఇంకా ఉంది

శ్రీనివాసానుగ్రహం ఎంత గొప్పదో వశిష్ఠ చరిత్ర ద్వారా తెలుసుకోవచ్చును. ఆ కథ ఇప్పుడు తెలుసుకొందాం.

శ్లోII ప్రాప్నువంతి మహత్పుణ్యం ఇతి సర్వర్షి సమ్మతమ్
కథాయాం కథ్యమానాయాం, యే భవంత్యపరాక్మఖాః
తస్మాదేకాగ్ర హృదయైః కార్యాంతర వినిస్పృహైః
భవాదృశైః పుణ్యకథా శ్రోతవ్యాంజలికారిభిః II

(బ్రహ్మోత్తరఖండం.వేం.మా.అ.50.శ్లో.3,4)

ఒకప్పడు సూతుడు శౌనకాదులతో నైమిశారణ్యంలో ఇలా అన్నాడు — మహర్షులారా! మీ బోటి వారికి సకల శుభాలనూ కలిగించే ఒక కథ చెపుతాను వినండి. ఈ కథ విన్నంత మాత్రాన సకల పాపాలు నశిస్తాయి. కేవలం పాపాలు తొలగడమే కాక, శ్రీవేంకటేశుని ఈ దివ్య కథ వినడం వల్ల అనుకొన్న కోరికలు తీరుతాయి. శుభాలు కలుగుతాయి. కనుక మీరు ఏకాగ్రచిత్తులై మరొక పనిని గుఱించి ఆలోచించక ఈ పుణ్యకథ వినండి. భక్తులు ఎవ్వరైనా ఈ కథను వినడానికి అర్హులే. ఈ కథను భక్తి లేని వారికి వినిపించరాదు. ఒకానొక కాలంలో వసిష్ఠుడు, బ్రహ్మర్షులు, దేవర్షులు, సాధువులు, జ్ఞానులు అయిన కొందరిని వెంటబెట్టుకొని బ్రహ్మలోకానికి వెళ్ళాడు. ఆ సమయంలో లోకశ్రేయస్సు కోసం బ్రహ్మ ఒక అద్భుతమైన సభను ఏర్పాటు చేసాడు. తెల్ల తామరపూవుపై బ్రహ్మదేవుడు కూర్చుని ఉన్నాడు. ఆయనకు ఎదురుగా సువర్ణమణిమయాసనాలపై దేవతలు, మనువులు, పరమపుణ్యాత్ములైన మహాచక్రవర్తులు, యోగులు, సిద్ధులు, సనకసనందనసనత్కుమార సనత్సుజాతులు, నారదుడు, తుంబురుడు కూర్చుని ఉన్నారు. వేదాలు, పురాణాలు, శాస్త్రాలు రూపాలు ధరించి బ్రహ్మను భక్తితో సేవిస్తున్నాయి. గంగ, యమున, సరస్వతి, గోదావరి, కృష్ణ వంటి నదీనదాలు, పుణ్యతీర్థాలు, సముద్రాలు రూపాలు ధరించి ఒక ప్రక్క కూర్చుని ఉన్నాయి.....ఇంకా ఉంది



# శ్రీ మత్స్యమహాపురాణం

## మత్స్యావతార కథనం

"నీవెవరవు? రాక్షసరాజువా లేక వాసుదేవుడవా? అట్లా కానిచో నీ వింత పెద్ద ఆకారాన్ని ఎలా ధరించగలవు? రెండు లక్షల యోజనములంత శరీరము దాల్చుట ఎవ్వరితరము? మహానుభావా! కేశవా! మత్స్యరూపుడవై నన్ను శ్రమపెట్టుచున్న నీవు సాక్షాత్తు జగద్రక్షకుడవైన జనార్దనుడవే! జగన్నాథా! నీకు నమస్కారం. మనువు ఇట్లు పలుకగా మత్స్యరూపుడైన శ్రీమన్నారాయణుడు అనఘా! యధార్థం తెలుసుకొన్నావు. అచిర కాలంలో పర్వతాలు, మహావనాలు, వనాలతో కూడిన ఈ భూమి నీట మునిగి పోతుంది. జీవ సముహాన్ని రక్షించడానికి ఈ నౌకను దేవతలచేత నిర్మింపజేసాను. చెమట నుండి, ఉష్ణము నుండి పుట్టు దోమలు మొదలగువాటికి, గ్రుడ్ల నుండి పుట్టు పక్ష్యాదులకు నేలను చీల్చుకొని పుట్టు మొక్కలు మొదలగు వాటికి, మావి నుండి పుట్టు మనుష్యులు మొదలగు ప్రాణులన్నింటికి ఏ కీడు కలుగకుండ నీవు కాపాడాలి. ఈ కన్పించే ఓడ ప్రళయకాలంలో వాయు ప్రభావంతో కదలి పోతూ ఉంటుంది. అప్పుడు నీవు ఈ నౌకను మహామత్స్యరూపంలో ఉన్న నా కొమ్ముకు కట్టివేస్తే నౌకను ఏ అపాయం ఉండదు. ప్రళయకాలం పూర్తి కాగానే స్థిరచర రూపమయిన ఈ జగత్తునకంతటికీ నీవు ప్రజాపతివి కామన్నావు. ఈ విధంగా కృతయుగారంభంలో మన్వంతరాధిపతివై, దేవతల చేత కూడా పూజలందుకొంటావు. మత్స్యము పలికిన మాటలు విన్న మనువు "భగవాన్! ఎన్ని సంవత్సరాల తరువాత ప్రళయం సంభవిస్తుంది? ప్రాణులను నేను ఎలా రక్షించాలి? నాకు నీతో మరల కలయిక ఎలా కలుగుతుంది? దయతో ఈ విషయాలు నాకు తెలియజేయండి" అని ప్రార్థించాడు. అప్పుడు మత్స్యరూపియైన శ్రీమన్నారాయణుడు ఇలా అన్నాడు — "మనువా! ఇకపై భూమండలంపై అనావృష్టి పీడిస్తుంది. నూరు సంవత్సరాలు ఈ అనావృష్టితో జీవకోటి యావత్తూ నశిస్తుంది. తరువాత అల్పప్రాణుల నాశనానికై సూర్యభగవానుడు దారుణమైన ఏడు కిరణాలతో నిప్పు కణికలను వర్షిస్తాడు. అప్పుడు బడబాగ్ని కూడా విజృంభిస్తుంది. పాతాళం నుండి సంకర్షణుని (భగవంతుని ఒక వ్యూహం) ముఖం నుండి అగ్ని వెలువడుతుంది. అదే సమయంలో పరమేశ్వరుని మూడవ కంటి నుండి అగ్ని వెలువడుతుంది. అదే సమయంలో పరమేశ్వరుని మూడవ కంటి నుండి అగ్ని వెలువడి ముల్లోకాలను దహిస్తూ సంక్షోభం కలిగిస్తుంది. ఈ విధంగా భూమంతయు తగులబడిపోయి తాబేటి వీపులా మారిపోతుంది. ఆకాశాన్ని సూర్యుని వేడిమి కమ్ముకొంటుంది. దానివల్ల దేవతలు, నక్షత్రాలు కూడా నశింపగా — సంవర్తము, భీమనాదము, ద్రోణము, ఇంద్రము, వలాహకము, విద్యుత్పతాకము, శోణము అను ఏడు ప్రళయ మేఘాలు ప్రళయాగ్ని వేడిమికి పుట్టి ఈ భూమికి తమ వాన నీటితో ముంచెత్తుతాయి. ఏడు సముద్రాలు ఏకమైపోయి కలవరం ఏర్పడుతుంది. ఇవి మూడు లోకాలను సంపూర్ణంగా ఒకే సముద్రంగా చేస్తాయి. అట్టి స్థితిలో నీవు ఈ దేవతల చేత నేను సృష్టింపజేసిన ఈ నౌకలో బీజములు మొదలగు వాటిని భద్రపఱచి, నేను ప్రవర్తిల్లజేయు యోగంతో (రక్షణ విధానం) వాటిని రక్షించు. ఈ నావను నా కొమ్ముకు కట్టబడి యుండుటచే, నా మహిమచే అన్ని విధాలా రక్షింపబడుతూ — దేవతలు నశించిననూ నీవు మాత్రం ఉంటావు.

....ఇంకా ఉంది



# ఐశ్వర్యయోగం

శ్రీ మహాగణాధిపతయేనమః　　శ్రీ మాత్రేనమః　　శ్రీ గురుభ్యోనమః

ఆరోగ్యమే ఐశ్వర్యంగా భావించి జీవించే భక్తజనావళికి ఈ ఐశ్వర్యయోగం అమృతకలశం. సద్భక్తుల హృదయాలలో చేరిన మాలిన్యాన్ని తొలగించడానికి, సకల ఆరోగ్యసంపదలు అందరికీ అందజేయడానికి, శ్రీ లలితాసహస్రనామాలనే కుసుమాలను ఐశ్వర్యయోగంగా మలచారు సద్గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారు. లలితా సహస్రనామాలు అందరికీ సుపరిచితమే కానీ, ఏ నామాన్ని పారాయణం చేస్తే, తమ జీవనగమనాన్ని మార్చుకోవచ్చో తెలియజేసేదే ఐశ్వర్యయోగం. సమస్త జనులకు ఇది దివ్య ఔషధము

## 350. వాగ్వాదినీ ( ఓం ఐం హ్రీంశ్రీం వాగ్వాదిన్యై నమః )




వాక్కు అనే సంస్కృత పదానికి మాట, పలుకు, భాష అనే అర్థాలున్నాయి. అమ్మవారు ఏది మాట్లాడినా మధురమే. అద్భుతమైన వాక్కులు కలిగినది అమ్మ. వాగ్వాదిని అనే పేరుతో ఒక దేవతాస్వరూపం ఉన్నదని దేవీభాగవతంలో ఉంది. తనను నిరంతరం సేవించే భక్తుల నాలుకలపై చేరి వారిని సిద్ధవాక్కులనుగా చేస్తుంది. కనుక అమ్మవారిని వాగ్వాదిని అన్నారు.

### మంత్ర ప్రయోగం — ఫలితం

నలభై రోజులపాటు ఈ మంత్రజపం చేయాలి. నిత్యం తెల్ల పూలతో అమ్మను పూజించాలి. నైవేద్యంగా పటిక బెల్లం పెట్టాలి. ఆ ప్రసాదం తినిపిస్తే అస్పష్టంగా మాట్లాడేవారికి స్పష్టవాక్కు వస్తుంది. తెలివితక్కువవారికి, (బుద్ధి మాంద్యం) ఈ మంత్రం అద్భుతంగా పని చేస్తుంది. ఈ మంత్రజపం చేసేటప్పుడు అమ్మవారిని పూజించిన తెల్లపూలు శిరస్సున ధరిస్తే అద్భుతమైన ధారణశక్తి వస్తుంది . వాక్ చాతుర్యం వస్తుంది. కవిత్వశక్తి అభివృద్ధి అవుతుంది.రాణిస్తారు.


... మరొక నామార్థ వివరణ వచ్చే సంచికలో

# ఋషి చరిత్ర

## మహర్షి చ్యవన

చ్యవన మహర్షి యవ్వన పునరుద్ధరణలో అశ్వినీకుమారులు ఉపయోగించిన ఔషధ పద్ధతులు తర్వాత కాలంలో "చ్యవనప్రాశం" అనే అమృతతుల్యమైన ఆయుర్వేద లేహ్యంగా ప్రసిద్ధి చెందాయి. ఇది ప్రాణశక్తి, దీర్ఘాయువు, శరీరబలం, రోగనిరోధకశక్తి పెంపుదలలో ప్రధాన పాత్ర వహిస్తుంది. శతపథ బ్రాహ్మణం మరియు పురాణాలలో పేర్కొన్న మూడు ప్రధాన చికిత్సలు —— చెరువులో ఔషధస్నానం, మూలికామండనం, చ్యవనప్రాశ ఇవే ఆధునిక చ్యవనప్రాశ తయారీకి మూలాధారాలు. శరీరాన్ని పునర్జీవింపజేసే శక్తితో, ఇది ఆయుర్వేదంలో నేటికీ "కాయకల్ప మహౌషధం"గా నిలిచింది. చ్యవన మహర్షి భృగువంశానికి చెందినవాడు. ఆయన తండ్రి భృగు మహర్షి. వివిధ సంప్రదాయాల ప్రకారం ఆయన భార్యలు ఇద్దరు. మనువు కుమార్తె అరుషి మరియు శర్యాతి కుమార్తె సుకన్య. సుకన్య చ్యవనునికి అత్యంత సేవాభావంతో చిరస్థాయిగా నిలిచిన సతీమణి. వారికి అప్నవనుడు, దధీచి వంటి మహర్షులు కుమారులుగా జన్మించారు. దధీచి మహర్షి తన ఎముకలను ధర్మరక్షణ కోసం దేవతలకు సమర్పించి అమరుడయ్యాడు. కొన్ని వాఖ్యానాల్లో ప్రమతి అనే మరో కుమారుడి గురించిన ప్రచారమూ ఉంది. చ్యవనుడు హరిత మహర్షికి కూడా తండ్రి అన్న సంప్రదాయం ఉంది. చ్యవన మహర్షి భారత వేదసంస్కృతిలో మహత్తర ప్రభావం చూపిన తపోనిధి. సుకన్య పతివ్రత్యాన్ని కాపాడుతూ అశ్వినీదేవతల వైద్యకళను ప్రజలకు చేరవేసి, యజ్ఞాలలో దేవతల హక్కులను స్థిరపరిచిన ధర్మవేత్తగా నిలిచాడు. ఇంద్రుని వజ్రాయుధాన్నే నిలిపేయగల శక్తి, 'మద' అనే రాక్షసుని సృష్టించగల మహాశక్తి, తపస్సు ద్వారా లోకశ్రేయస్సు సాధించే మహాతేజస్సు —— ఇవన్నీ ఆయన అసామాన్య వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తాయి. చ్యవన మహర్షి భారత వేదతత్వంలో ఒక అజరామర పురుషుడు. సత్కార్యాల కోసం తపస్సు, ధర్మం కోసం ఇంద్రుడికైనా ఎదురు నిలిచే ధైర్యం, పాతివ్రత్య శక్తికి శాశ్వతసాక్ష్యంగా నిలిచిన సుకన్య కథ, అశ్వినులకు సోమరసాన్నివ్వడానికి చేసిన యజ్ఞపర యుద్ధం —— ఇవన్నీ చ్యవన మహర్షిని ఇతిహాసాల్లో చిరస్థాయిగా నిలబెట్టాయి. ఆయుర్వేదంలో "చ్యవనప్రాశం" రూపంలో ఆయన ఔషధ జ్ఞానం నేటికీ జీవిస్తుంది. సమస్త గ్రంథాల్లో ఆయనను తపోశక్తి, జ్ఞానవైభవం, ధర్మసంరక్షణకు ప్రతీక.

.ఇంకాఉంది




# కాశీ కథలు

## దివోదాసుని వృత్తాంతం

శివుడు ఢుంఢి గణపతిని స్తోత్రము చేసెను . ఆ స్తోత్రమును మనుషులు చేస్తే కలుగు శుభములను వివరించెను. ఆ తర్వాత కాశీ యందు 56 రూపములతో ఏడు ఆవరణలలో కొలువుదీరిన వినాయకుడిని ,ఆయన రూపములను దర్శించడం వల్ల కలుగు ఫలితములను వివరించెను

| ఆవరణ | గణపతి నామము | దర్శనము వలన కలుగు ఫలితం |
|---|---|---|
| తృతీయ | వక్రతుండ వినాయకుడు | పాపములు తొలగును |
| తృతీయ | ఏకదంత వినాయకుడు | ఉపద్రవములు నశిస్తాయి |
| తృతీయ | త్రిముఖ వినాయకుడు | కాశీ లో భయములు ఉండవు |
| తృతీయ | పంచముఖ వినాయకుడు | వారణాసి రక్షకుడు |
| తృతీయ | హేరంబ వినాయకుడు | కాశీవాసుల కోరికలు తీర్చును |
| తృతీయ | విఘ్నరాజ వినాయకుడు | విఘ్నములు తొలగును |
| తృతీయ | వరద వినాయకుడు | వరములు ఇచ్చును |
| తృతీయ | మోదకప్రియ వినాయకుడు | కోరికలు తీర్చును,విఘ్నములు తొలగును |



కాశీ లో తృతీయ ఆవరణ నుండి భక్తులకు సర్వసిద్ధులను అనుగ్రహించి శుభములను కలుగజేస్తూ భక్తులను కాశీలో అనుగ్రహిస్తూ ఉన్నారు గణపతి. గణపతి స్వామి దుష్టులను, అభక్తులను దుర్మార్గులను కాశీ నుండి బయటకు పంపివేయును

..ఇంకాఉంది

## శ్రీ దత్తాత్రేయ స్తోత్రమ్

1. జటాధరం పాండురంగం, శూలహస్తం కృపానిధిమ్ |
సర్వరోగహరం దేవం, దత్తాత్రేయ మహం భజే ||

2. జగదుత్పత్తికర్త్రే చ, స్థితిసంహారహేతవే |
భవనాశ విముక్తాయ దత్తాత్రేయ ! నమోఽస్తు తే ||

3. జరాజన్మవినాశాయ, దేహశుద్ధికరాయ చ |
దిగంబర ! దయామూర్తే ! దత్తాత్రేయ ! నమోఽస్తు తే ||

4. కర్పూరకాంతిదేహాయ, బ్రహ్మమూర్తిధరాయ చ |
వేదశాస్త్రపరిజ్ఞాయ, దత్తాత్రేయ ! నమోఽస్తు తే ||

5. హ్రస్వదీర్ఘకృతస్థూల నామగోత్రవివర్జిత ! |
పంచభూతైకదీప్తాయ, దత్తాత్రేయ ! నమోఽస్తు తే ||

6. యజ్ఞభోక్త్రే చ యజ్ఞాయ, యజ్ఞరూపధరాయ చ |
యజ్ఞప్రియాయ సిద్ధాయ, దత్తాత్రేయ ! నమోఽస్తు తే ||

7. ఆదౌ బ్రహ్మ హరిర్మధ్యే హ్యంతే దేవస్సదాశివః |
మూర్తిత్రయస్వరూపాయ, దత్తాత్రేయ! నమోఽస్తు తే ||

8. భోగాలయాయ భోగాయ, యోగయోగ్యాయ ధారిణే |
జితేంద్రియ జితజ్ఞాన, దత్తాత్రేయ ! నమోఽస్తు తే ||

9. దిగంబరాయ దివ్యాయ, దివ్యరూపధరాయ చ |
సదోదితపరంబ్రహ్మ దత్తాత్రేయ ! నమోఽస్తు తే ||

10. జంబూద్వీపే మహాక్షేత్రే, మాతృపురనివాసినే |
జయమానసతాం దేవ ! దత్తాత్రేయ ! నమోఽస్తు తే ||

11. భిక్షాటనం గృహే గ్రామే, పాత్రం హేమమయం కరే |
నానాఽఽస్వాద్యమయీ భిక్షా దత్తాత్రేయ! నమోఽస్తుతే ||

12. బ్రహ్మజ్ఞానమయీ ముద్రా, వస్త్రమాకాశభూతలే |
ప్రజ్ఞానఘనబోధాయ, దత్తాత్రేయ! నమోఽస్తు తే ||

13. అవధూత సదానంద, పరబ్రహ్మస్వరూపిణే |
విదేహదేహరూపాయ, దత్తాత్రేయ! నమోఽస్తు తే ||

14. సత్యరూప! సదాచార! సత్యధర్మపరాయణ! |
సత్యాశ్రయ! పరోక్షాయ, దత్తాత్రేయ! నమోఽస్తు తే ||

15. శూలహస్త! గదాపాణే! వనమాలాసుకంధర! |
యజ్ఞసూత్రధర బ్రహ్మన్ దత్తాత్రేయ! నమోఽస్తు తే ||

16. క్షరాక్షరస్వరూపాయ, పరాత్పరతరాయ చ |
దత్తముక్తిపరస్తోత్ర దత్తాత్రేయ! నమోఽస్తు తే ||

17. దత్తవిద్యాయ లక్ష్మీశ! దత్తస్యాత్మస్వరూపిణే |
గుణనిర్గుణరూపాయ, దత్తాత్రేయ! నమోఽస్తు తే ||

18. శత్రునాశకరం స్తోత్రమ్, జ్ఞానవిజ్ఞానదాయకమ్ |
సర్వపాపప్రశమనం, దత్తాత్రేయ! నమోఽస్తు తే ||

19. ఇదం స్తోత్రమ్ మహాదివ్యం, దత్తప్రత్యక్షకారకమ్ |
దత్తాత్రేయ ప్రసాదాచ్చ, నారదేన ప్రకీర్తితమ్ ||